అతిసారపై అవగాహన కల్పించండి

వీరపునాయునిపల్లె : మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో అతిసార వ్యాధిపై అవగాహన సదస్సులు నిర్వహించాలని ఎంపీడీఓ పులిరామ్‌సింగ్, మండల వైద్యాధికారి మహమ్మద్ తాహ అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సభా భవనంలో పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ సూపర్‌వైజర్‌లు, ఏఎన్ఎమ్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులు డయేరియా బారిన పడి చనిపోకూడదన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా నెల రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో అతిసార వ్యాధి ప్రబలకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఓఆర్‌యస్ ప్యాకెట్లు, జింక్ ట్యాబ్లెట్లు ప్రతి ఇంటికి పంపిణీ చేయడంతోపాటు వాటిని వాడే విధానం గురించి అవగాహన కల్పించాలని తెలియజేశారు. ప్రతి గ్రామంలోని విలేజ్ క్లినిక్, అంగన్వాడీ కేంద్రంలో ఓఆర్‌యస్ ప్యాకెట్లు, జింక్ కార్నర్ ఏర్పాటు చేయాలన్నారు. చేతులు శుభ్రం చేసుకోవడంతోపాటు పరిసరాల వ్యక్తిగత పరిశుభ్రత పట్ల పాఠశాలల్లోని విద్యార్థులకు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. వంట ఏజెన్సీ నిర్వాహకులు వంట చేయు ప్రదేశాన్ని పరిశుభ్రంగా ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సీహెచ్ఓలు ప్రతి గ్రామంలో తాగునీటి నమూనాలను సేకరించి వాటిని వాటర్ క్వాలిటీ చెక్ చేయాలని, అంతే కాకుండా ప్రైవేటు వాటర్ ప్లాంట్లలో కూడా పరీక్షలు నిర్వహించాలని తెలియజేశారు. ఎంపీడీఓ పులిరామ్ సింగ్ మాట్లాడుతూ తాగు నీరు కలుషితం కావడం వల్ల డయేరియా బారిన పడే అవకాశం ఉందని, కనుక తాగునీరు కలుషితం కాకుండా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. గ్రామాల్లోని ఓవర్‌హెడ్ ట్యాంకులను పరిశీలించి శుభ్రం చేయించాలన్నారు. తాగునీటిని సరైన పద్ధతిలో క్లోరినేషన్ చేయాలని చెప్పారు. సచివాలయాల్లోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పైపులైన్లు తనిఖీ చేయాలని, లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. గ్రా సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఇతర ఆరోగ్య శాఖ సిబ్బంది భాగస్వామ్యంతో వ్యక్తిగత పరిశుభ్రతపై ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టాలని తెలియజేశారు. ఈ కార్యక్రమం విజయవంతం కావాలంటే వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూస్ శాఖలు పూర్తి సమన్వయంతో పని చేయాల్సిన అవసరముందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడి సూపర్‌వైజర్‌లు, ఏఎన్ఎమ్‌లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ పులిరామ్‌సింగ్

ఘన నివాళి



హెలెన్ కెల్లర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న దృశ్యం

కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలోని హెలెన్ కెల్లర్ బధిరుల ఉన్నత పాఠశాలలో బుధవారం హెలెన్ కెల్లర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెలెన్ కెల్లర్ చిత్రపటానికి హెలెన్ కెల్లర్ విద్యాసంస్థల జనరల్ సెక్రటరీ కమ్ కరస్పాండెంట్ దౌలత్‌ఖాన్, ప్రిన్సిపాల్ మసూదబేగంలు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కమలాపురం : వర్షా కాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ హోమియో వైద్యాధికారి షాకీర్ హుసేన్ తెలిపారు. స్థానిక బాయ్స్ హైస్కూల్‌లో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. 345 విద్యార్థులను పరీక్షించి వారికి డయేరియా, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యగా హోమియో మందులు తినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వ్యాధులకు హోమియోలో అద్భుత చికిత్సలు ఉన్నాయన్నారు. అలాగే ఈ మందులు వినియోగిస్తే సైడ్ ఎఫెక్ట్స్ రావన్నారు. దీర్ఘకాలిక వ్యాధులైన మోకాళ్ల నొప్పులు, నడుము నొప్పులు, చికున్ గున్యా తదితర వ్యాధులకు సైతం హోమియోలో అద్భుత మందులు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ కమలాపురంలోని హోమియో వైద్యశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు రాఘవ పాల్గొన్నారు.

అతిసార పట్ల అప్రమత్తంగా ఉండాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల కారణంగా అతిసార పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసన్నలత తెలిపారు. గురువారం కడప నగర పరిధిలోని నాగరాజుపేట అర్బన్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ పరిధిలోని సీఎస్ఐ హైస్కూలులో విద్యార్థులకు కలరా, అనీమియా, బీసీజీ, టీకాలపై అవగాహన కల్పించారు. ప్రసన్న లత మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ,వ్యక్తిగత పరిశుభ్రతలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో, ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. బీసీజీ టీకాలు ప్రతీ సోమవారం, గురువారాలలో ఆరోగ్య కేంద్రాల్లో నిర్దేశించిన ఆరు వర్గాల వారికి వేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హోమియోపతి ట్రైనింగ్ వైద్యులు డాక్టర్ అనూష, డాక్టర్ బేబీ శ్వేత, డాక్టర్ గ్రీష్మ, హెడ్మాస్టర్ దేవ సహాయం, మేరీ , ఆదిలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



విద్యార్థికి హోమియో మందు తినిపిస్తున్న వైద్యుడు షాకీర్ హుసేన్

రైతుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

కమలాపురం : రాష్ట్రంలో ఏర్పడిన నూతన ప్రభుత్వం రాష్ట్రంలోని రైతాంగ సమస్యలను పరిష్కరించాలని సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని డీటీ అహల్యకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన సాగు సాయం రూ.20 వేలు ఈ సీజన్‌లో రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. పెరిగిన ఉత్పత్తి, ఖర్చులకు అనుగుణంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచి పంట రుణాలు వడ్డీ లేకుండా రూ.3 లక్షల వరకు ఇవ్వాలన్నారు. అలాగే పావలా వడ్డీతో రూ.5 లక్షల వరకు ఇవ్వాలన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చే ప్రక్రియ చేపట్టి వారికి రుణాలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యవసాయానికి అవసరమైన ఎద్దులు, బండ్లు, పనిముట్లు 50 శాతం సబ్సిడీతో అందించాలన్నారు. ట్రాక్టర్లకు 50 శాతం సబ్సిడీతో డీజిల్ అందించాలన్నారు. కల్తీ విత్తనాలను అరికట్టి, కల్తీ విత్తనాలు విక్రయించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు షేక్షావలి, మిద్దె రమణ, సుబ్బరాయుడు, రాయప్ప తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న సీపీఐ, రైతు సంఘం నాయకులు

రవాణా శాఖా నిబంధనలు పాటించాలి

రాజంపేట : ప్రతి ఒక్క వాహనదారుడు నిబంధనలు తప్పనసరిగా పాటించాలని రాజంపేట మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) వినోద్‌కుమార్ తెలిపారు. గురువారం కడప - తిరుపతి రహదారిలో ఆర్టీసీ, రవాణా శాఖలు సంయుక్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిట్‌నెస్ ఉన్న వాహనాలనే నడపాలన్నారు. అలా కాకుండా నడిపితే తనిఖీలలో పట్టుబడితే సీజ్ చేయడం జరుగుతుందన్నారు. రవాణాశాఖ పరంగా వాహనాలకు చెల్లించాల్సిన ట్యాక్స్, వివిధ రకాల అనుమతులు తప్పనసరిగా కలిగి ఉండాలన్నారు. అలాగే రోడ్డు సెఫ్టీ రూల్స్‌ను పాటించాలన్నారు. ఆర్టీసీ డీఎం రమణయ్య మాట్లాడుతూ నెలకొకసారి నిర్వహించే స్పెషల్ డ్రైవ్‌ను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. 45 వాహనాలను తనిఖీ చేసి, 8 వాహనాలకు వీసీఆర్ జారీ చేశామన్నారు. ఎనిమిది వాహనాలను సీజ్ చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో డిపో కార్యాలయం అధికారి మోడపోతుల రమణయ్య, ఎంవీఐ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రాజంపేట ఆర్టీసీ బస్టాండు వద్ద స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన ఆర్టీసీ డీఎం, ఎంవీఐ

చీటింగ్ కేసు నమోదు

కడప అర్బన్: కడప నగరంలోని ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో దస్తగిరి జెండామాను వీధికి చెందిన షేక్ హుసేన్, తన కుమారుడు అర్షద్ హుసేన్‌కు చెన్నైలో ఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో సీటు కోసం తిరుమలరెడ్డి అనే వ్యక్తిని ఆశ్రయించారు. అతనికి రూ. 1. 25 లక్షలు చెల్లించారు. అయినా సీటు ఇప్పించకపోవడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ భాస్కర్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తిపై దాడి

కడప అర్బన్: కడప నగరంలోని ఒన్‌టౌన్ పోలీస్ పరిధిలో ఏడురోడ్ల కూడలి వద్ద గురువారం జిలానీ బాష అనే వ్యక్తి వెంకటేష్ అనే వ్యక్తిపై డబ్బుల లావాదేవీల వ్యవహారంలో దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ రంగస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ సెంటర్‌లో అగ్నిప్రమాదం

కడప అర్బన్: కడప నగరంలోని అప్సరా కూడలి నుంచి చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ దారిలో వున్న రెడ్డి చికెన్ సెంటర్‌లో గురువారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పైగదిలో వున్న పాత సామాగ్రితో పాటు వున్న వస్తువులన్నీ పూర్తిగా కాలిపోయాయి. చికెన్ సెంటర్ యజమాని ఫిర్యాదు మేరకు ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి వెళ్లి మంటలను అదుపు చేశారు. దాదాపు రూ. 50 వేలు ఆస్తినష్టం జరిగింది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని ఫైర్ అధికారులు సూచిస్తున్నారు.

చక్కని పరిజ్ఞానం అందిపుచ్చుకోవాలి





సాంస్కృతిక కార్యక్రమం ప్రదర్శిస్తున్న విద్యార్థులు, సమావేశంలో మాట్లాడుతున్న కళాశాల డీన్ మణి

పులివెందుల టౌన్ : విద్యార్థులు చక్కని పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని బెంగళూరు గ్లోబల్ గ్రీన్ కంపెనీ ప్రయివేట్ లిమిటెడ్ డీజీఎం చంద్రమోహన్, తెనాలి డబుల్ హార్స్ మినపగుళ్ల జీఎం కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాలలో కాలేజ్ అండ్ హాస్టల్ డే వేడుకలు నిర్వహించారు. కళాశాల డీన్ డాక్టర్ మణి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పులివెందుల ఆహార విజ్ఞానశాస్త్రం కళాశాలలో విద్యార్థులకు అన్ని సదుపాయాలతో కూడిన వనరులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులు అందుబాటులో ఉన్నారన్నారు. ఆహార ప్రాసెసింగ్ సెక్టార్‌లో అనేక అవకాశాలున్నాయన్నారు. అనంతరం విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పోటీలలో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్ ఎం.ఎస్.బేగ్, వార్డెన్ డాక్టర్ కీర్తిరెడ్డి, అరుణ, రాజేష్, జయమ్మ, నివేదిత, సాయి శ్రీనివాస్, రాజశేఖర్, సుబ్బారెడ్డి, ఎస్.సుబ్బారెడ్డి, టెక్నికల్ ఆఫీసర్ రాజ్‌కుమార్, లయోలా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అమలా ఆరోఖ్య రాజ్, ఇతర కళాశాలల బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

మాదిగ జనజాతరను విజయవంతం చేయాలి

ప్రొద్దుటూరు కల్చరల్: ప్రకాశం జిల్లాలోని ఈదుముడి గ్రామంలో జులై 7న నిర్వహించే మాదిగ జనజాతరను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్యమాదిగ తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీవర్గీకరణ కోసం ఉద్యమం ప్రారంభమై 30 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సభ నిర్వహిస్తున్నామన్నారు. ఎస్సీ రిజర్వేషన్‌లను ఏ,బీ,సీ,డీలుగా వర్గీకరించాలని ప్రారంభమైన ఎమ్మార్పీఎస్ ఉద్యమం సమాజంలోని అన్ని పీడిత వర్గాలకు అండగా నిలిచిందన్నారు. మాదిగలు బహిరంగ సభలో పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్ఎం రాజా, నాయకులు నరసింహులు, ఎల్లయ్య, పుల్లయ్య, శ్రీనివాస్, చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

భవిత చిన్నారులకు దుప్పట్ల పంపిణీ

వేంపల్లె : స్థానిక మెయిన్ బజార్‌లోని భవిత దివ్యాంగుల కేంద్రంలో ఉన్న చిన్నారులకు కడప రూరల్ డెవలప్‌మెంట్ ఫర్ యూత్ వెల్ఫేర్ సమితి వారు గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ-2 స్టాలిన్ ఐజాక్ మాట్లాడుతూ దాతలు ముందుకు వచ్చి భవిత దివ్యాంగుల విద్యావనరుల కేంద్రం చిన్నారులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కడప రూరల్ డెవలప్‌మెంట్ ఫర్ యూత్ వెల్ఫేర్ సమితి సెక్రటరీ నజీమ్ అహమ్మద్, భవిత దివ్యాంగుల కేంద్రం ఐఈఆర్టీలు యశోద, సుజాత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'నా కుమారుడిని చంపిన వారిని శిక్షించాలి'

కడప రూరల్ : తన కుమారుడిని చంపిన వారిని శిక్షించాలని కడప నగరం పాతకడపకు చెందిన పాలకొండయ్య కోరారు. గురువారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన కుమారుడు సుబ్బరాయుడు భార్య వేరొకరితో అక్రమ సంబంధం పెట్టుకుందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో 2020వ సంవత్సరంలో తన కుమారుడు హత్యకు గురయ్యాడని తెలిపారు. దీనిపై విచారణ చేపట్టి న్యాయం చేపట్టాలని కోరారు.

శిక్షణా తరగతులను జయప్రదం చేయండి

రాయచోటి అర్బన్ : కాకినాడలో జూలై 8, 9, 10 తేదీలలో నిర్వహించే రాష్ట్రస్థాయి విద్య, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలో ఆయన ఏఐఎస్ఎఫ్ నేతలతో కలసి శిక్షణా తరగతుల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు రాజకీయాలపైన ఆసక్తిని కనబరచాలన్నారు. విద్యార్థి దశలోనే ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. చదువుతోపాటు విద్యావ్యవస్థలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై పోరాటాలు చేయడం ఎలా అనే అంశంపై శిక్షణా తరగుతులలో అవగాహన కల్పిస్తామన్నారు. అవినీతి, అక్రమాలకు కేరాఫ్ అడ్రస్సుగా నిలిచిన నీట్‌పరీక్షను కేంద్రప్రభుత్వం వెంటనే రద్దుచేయాలన్నారు. విద్యార్థులను మరింత చైతన్యవంతులను చేసేందుకు కాకినాడలో నిర్వహిస్తున్న శిక్షణా తరగతులకు విద్యార్థి లోకం హాజరై విజయవంతం చేయాలంటూ కోరారు.

బీసీ హాస్టళ్ల సమస్యలను పరిష్కరించాలి

ప్రొద్దుటూరు కల్చరల్: బీసీ హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని పలు బీసీ సంక్షేమ హాస్టల్‌లను గురువారం సందర్శించి విద్యార్థులను, వార్డెన్‌లతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. బాత్రూంల డోర్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, కిటికీలు దెబ్బతినడంతో దోమల బెడద ఎక్కువగా ఉందని మోడంపల్లె సాంఘీక సంక్షేమ శాఖ వసతి గృహ వార్డెన్ బ్రహ్మం మాట్లాడారు. జమ్మలమడుగు బైపాస్ రోడ్డు రాజేశ్వరి కాలనీలోని బీసీ సంక్షేమ వసతి గృహంలో వార్డెను సురేష్‌బాబును అడిగి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బీసీ సంఘనాయకులు మాట్లాడుతూ హాస్టల్ బిల్లులు నెలల తరబడి మంజూరు కాకపోవడంతో వార్డెన్లు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం స్పందించి బీసీ హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. హాస్టల్‌లను పరిశీలించిన వారిలో జాతీయ బీసీసంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య యాదవ్, జిల్లా కన్వీనర్ మాదాసు మురళి, ఉపాధ్యక్షుడు ప్రతాప్, సత్యసాయి, సుబ్బరాజు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు నియంత్రించాలి

జమ్మలమడుగు : ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లు పిల్లల తల్లిదండ్రుల నుంచి భారీగా ఫీజులు వసూలు చేస్తున్నాయని, అటువంటి వాటిపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకుడు వినయ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీ నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు అడ్మిషన్ ఫీజులంటూ భారీగా డబ్బులు వసూలు చేయడంతోపాటు పాఠశాలల్లోనే పుస్తకాలు, నోట్ పుస్తకాలు ఎక్కువ ధర కు అమ్ముతున్నారన్నారు.

క్లుప్తంగా

పరిశోధకుడికి డాక్టరేట్



వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం రాజనీతి శాస్త్రం, ప్రభుత్వ పాలన శాస్త్ర విభాగం పరిశోధకుడు సి. ప్రవీణ్ కుమార్‌కు విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. విశ్వవిద్యాలయ రాజనీతిశాస్త్ర ఆచార్యులు డా. జి. పార్వతి పర్యవేక్షణలో 'ఇంపాక్ట్ ఆఫ్ డీ సెంట్రలైజేషన్ ఆన్ సర్వీస్ డెలివరీ సిస్టం ఎ స్టడీ ఆఫ్ సెలెక్టెడ్ విలేజ్ సెక్రటేరియట్ ఇన్ కర్నూలు డిస్ట్రిక్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' అన్న అంశంపై ఈయన చేసిన పరిశోధనకు గాను ఈయనకు డాక్టరేట్ ప్రదానం చేశారు.

29 నుంచి మహాయాగం



మాట్లాడుతున్న డాక్టర్ మాళిగి విద్యానిధి

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన ఆధ్యాత్మ విద్యా ప్రతిష్ఠానం ఆధ్వర్యంలో ఈనెల 29, 30 తేదీలలో దశకోటి కృష్ణ మంత్ర మహాయాగం, శ్రీ సరస్వతి మహాయాగం నిర్వహించనున్నామని సంస్థ ప్రతినిధి పండిత డాక్టర్ మాళిగి విద్యానిధి ఆచార్య తెలిపారు. గురువారం కడప బ్రాహ్మణ వీధిలోని శ్రీ జూల్ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఆయన ఇతర ప్రతినిధులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. శనివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని, సాయంత్రం 6.30 గంటలకు శ్రీ సత్యభామ రుక్మిణి సమేత కృష్ణ పరమాత్ముడి వివాహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 7 గంటలకు దశకోటి కృష్ణ మంత్ర జప మహాయాగం, సరస్వతీ మహాయాగం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఆనంద తీర్థ, గుండూరావు, విజయసింహా, శ్యామసుందర్, కొసూరుగోపి, కట్టె రంగవిఠల్‌రావు, భానుజీరావు, మురళి, అరుణాదేవి, వేదవతి, ప్రభ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆర్‌జేయూపీ నాయకులు

కడప ఎడ్యుకేషన్: విద్య, ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల సాధనకు కృషి చేయాలని పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డిని ఆర్‌జేయూపీ నాయకులు కోరారు. ఈ విషయమై ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డిని పులివెందులలో ఆర్‌జేయూపీ రాష్ట్ర అధ్యక్షుడు గునిశెట్టి శ్రీనివాసులు ఆధ్వర్యంలో కలిసి సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఏకీకృత సర్వీసు నిబంధనల సవరణతోపాటు ఖాళీగా ఉన్న అన్ని రకాల క్యాడర్ల పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ అధికార ప్రతినిధి ముత్తోజి వీరబ్రహ్మం, టీచర్స్ హోం ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, సీనియర్ నాయకులు వీరయ్య, కృష్ణారెడ్డి, చరణ్ కుమార్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

గుర్తింపు లేని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లా వ్యాప్తంగా అనుమతి లేకుండా నడుస్తున్న చైతన్య, నారాయణ, ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి శేఖర్ కోరారు. గురువారం ఈ మేరకు జిల్లా విద్యా శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మున్నీర్‌కు ఎస్ఎఫ్ఐ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు పాఠశాలలోనే పాఠ్య పుస్తకాలను అమ్ముతూ అక్రమంగా వేల రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా నడుపుతున్న కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎస్ఎఫ్ఐ నాయకులు మనోజ్, అభినయ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ 2 మెయిన్స్‌కు అదనపు సమయం ఇవ్వాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ అభ్యర్థుల సమస్యలను గుర్తించి మెయిన్స్ పరీక్షకు మరింత అదనపు సమయం ఇవ్వాలని కోరుతున్నామని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ తెలిపారు. గురువారం నగరంలోని డీవైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష జూలై 28 నుండి నిర్వహిస్తామని ప్రకటించారన్నారు. అయితే ఎన్నికలు జరిగిన దృష్ట్యా అభ్యర్థులు ప్రిపరేషన్లో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. అలాగే సిలబస్ ఎక్కువగా ఉన్నదని, ఈ రెండు కారణాల దృష్ట్యా గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష జూలై 28 నుండి కాకుండా, మరో 2 నెలలు పాటు వాయిదా వేయాలని కోరారు. ఈ సమావేశంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బ నరసింహులు పాల్గొన్నారు.

29, 30న సాయిబాబా మందిరంలో రజతోత్సవాలు

కడప అర్బన్: కడప నగరంలోని నబీకోటలో వున్న శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో ఈనెల 29, 30 తేదీలలో శ్రీ షిరిడీ సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ రజత మహోత్సవాలను నిర్వహించనున్నారు. 29న ఉదయం 8 గంటలకు గణపతిపూజ, గంగపూజ, సాయంత్రం 5 గంటలకు కలశ స్థాపనం, వాస్తు శాంతి, మహా మంగళ హారతి నిర్వహిస్తారు. 30న ఉదయం 7 గంటలకు ప్రాతః కాల మహోత్సవ పూజలు, హోమం, మధ్యాహ్నం అన్న ప్రసాదం అందచేస్తారు. సాయంత్రం పల్లకి ఉత్సవం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలలో భక్తాదులు పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని ఆలయ ధర్మకర్త గోదెన కృష్ణమూర్తి, ప్రమీలమ్మ విజ్ఞప్తి చేశారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మనోహర్

కడప ఎడ్యుకేషన్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మనోహర్ అన్నారు. గురువారం కడప నగరం ఎర్రముక్కపల్లె గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులచే న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యాచట్టాలు, మంచి, చెడు స్పర్శ, విద్యాహక్కు, బాల కార్మిక నిరోధక చట్టం వంటి పలు చట్టాల గురించి పిల్లలకు వివరించారు. అలాగే టోల్ ఫ్రీ నెంబర్ 100, 1098, 15100, పోక్సోచట్టం మొదలగు అంశాల గురించి కూడా వివరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ మహేష్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శ్రీనివాసులరెడ్డి, పారా లీగల్ వాలంటీర్లు శ్రీనివాసరావు, శిరీష, గాంధీ నగర్ హైస్కూల్ ఇన్‌చార్జ్ హెచ్ఎం అశ్రీఫున్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.